పేక్షకులు థియేటర్ యాజమాన్యం మధ్య వాగ్వాదం

కుత్బుల్లాపూర్: చింతల్‌లోని ఏషియన్ థియేటర్‌లో సినిమా ఆలస్యం విషయమై శుక్రవారం ప్రేక్షకులు, థియేటర్ యాజమాన్యానికి గొడవ జరిగింది. నిర్దేశించిన సమయానికి స్క్రీన్‌పై సినిమాను ప్రదర్శించకపోవడంతో ప్రేక్షకులు నిరసన వ్యక్తం చేశారు. షోను అనుకున్న సమయానికి ఎందుకు ప్రదర్శించడం లేదని, తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాంకేతిక సమస్యతో ఆలస్యమైందని యాజమాన్యం చెప్పడంతో ప్రేక్షకులు శాంతించారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శనలు

నిజాంపేట్: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిజాంపేట్ బండారి లేఅవుట్‌లోని శ్రీదక్షిణముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ, శ్రీరామకృష్ణ నాట్య మండలి సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మోహిని భస్మాసుర, సత్య హరిశ్చంద్ర నాటకాలు రసవత్తరంగా సాగాయి. భస్మాసురుడిగా డాక్టర్ పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ, శివుడిగా జొన్నలగడ్డ జగన్మోహనరావు, హరిశ్చంద్రునిగా జగన్మోహనరావు, నక్షత్రకునిగా గణేష్ కుమార్, చంద్రమతిగా గంధం రాజేశ్వరి, లోహితాస్యుడిగా అభినవ్, బేతాళునిగా జంగయ్యగౌడ్ నటించి ఆహుతులను అలరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి శ్రవణ్ కుమార్, శ్రీనివాస్, వీరబ్రహ్మం, ఆహార్యం వెంకటస్వామి తదితరులు సంగీత సహకారం అందించారు.

ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇస్తాం

మెట్రో సాధన సభ్యులు

కుత్బుల్లాపూర్: ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్ట్ భూమిపూజకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి మేడ్చల్ మెట్రో రైల్ సాధన సమితి ఆధర్యంలో వినతి పత్రం అందజేస్తామని ఓరుగంటి వెంకటేశ్వర్లుయాదవ్ ప్రకటనలో తెలిపారు. ఎలివేటెడ్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ ప్రాంతానికి డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ మంజూరైతే మెట్రో రైల్ ఏర్పాటుకు మార్గం సుగుమం అవుతుందన్నారు. దీంతో ఎంతో కాలంగా నెలకొన్న ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని పేర్కొన్నారు. శనివారం ఉదయం కొంపల్లి బ్రిడ్జి నుంచి మేడ్చల్‌కు వెళ్లే మార్గంలో ఉన్న హోటల్ సత్వ కిచెన్ పక్కనే ఉన్న గ్రౌండ్‌లో ఎలివేటెడ్ ప్రాజెక్ట్ భూమిపూజ జరుగనుందన్నారు. మెట్రో సాధన సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీఎంకు వినతి పత్రం ఇచ్చే కార్యక్రమానికి రావాలని కోరారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



సాయిబాబానగర్ చౌరస్తాలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

సుభాష్‌నగర్: వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చడంలో చలివేంద్రాలు దోహద పడతాయని బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం విప్లవజ్యోతి అల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాయిబాబానగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఏసీపీ, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు ప్రారంభించి మజ్జిగను పంపిణీ చేశారు. అదే విధంగా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చలివేంద్రానికి వచ్చిన మహిళలను ఏసీపీ శ్రీనివాస్ సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఏసీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సత్తిబాబు, తాతాజీ, నాగరాజు, నరసింహ, చిన్న, గంగాధర్, హనుమతు, ప్రభాకర్, తులసి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



దీపక్‌జాన్‌ను సత్కరిస్తున్న నర్సారెడ్డి భూపతిరెడ్డి

దుండిగల్: కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు శ్రమించిన నేతలను గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారికి తగిన పదవులు అప్పగిస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా దీపక్ జాన్, ముస్లిం మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఒబేదుల్లా కోత్వాల్ నియమితులయ్యారు. వారిని భూపతి రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలి

పర్యావరణ పరిరక్షకుడు రవీందర్



సీఐ పవన్‌కు సహజ సిద్ధ కవర్‌ను అందజేస్తున్న రవీందర్

సుభాష్‌నగర్: పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్ భూతాన్ని ప్రతి ఒక్కరూ తరిమికొట్టాలని పర్యావరణ పరిరక్షకుడు రవీందర్ ముదిరాజ్ అన్నారు. శివరాత్రి పండుగను పురస్కరించుకుని ఆలయాల వద్ద ప్లాస్టిక్ కవర్లతో వచ్చిన భక్తులకు పర్యావరణానికి హానిగా లేకుండా సహజసిద్ధంగా తయారు చేసిన కవర్లను పంచి ప్లాస్టిక్ కవర్లను సేకరించాడు. జొన్నలు, సాబుధాన్యాలు, చెరుకు పిప్పి లేక తయారు చేసిన కవర్లను పంచిపెట్టాడు. ఈ కవర్ నెల రోజుల్లోనే భూమిలో కరిగిపోతుందన్నారు. వీటివల్ల పర్యావరణానికి ఎలాంటి ఇబ్బందులు ఉండదని తెలియజేశారు. ఈ సందర్భంగా రవీందర్ ముదిరాజ్ చేస్తున్న కృషిని అక్కడికి వచ్చిన కామారెడ్డి కలెక్టర్ సత్యనారాయణ, సీఐ పవన్‌లతో పాటు పలువురు భక్తులు ప్రశంసించారు.



రాత్రి వేళ

సూరారం ఉమామహేశ్వర ఆలయం వద్ద క్యూ కట్టిన భక్తజనం



ఉదయం వేళ

ఉపవాస దీక్షలు.. | శివయ్యకు పూజలు

హరహర మహాదేవ శంభో శంకర

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి
- శివ నామస్మరణతో మార్మోగిన ఆలయ పరిసరాలు

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని దేవాలయాల పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. తెల్లవారుజాము నుంచే శివయ్యకు అభిషేకాలు నిర్వహించారు. ఉదయం భక్తుల రద్దీ పెరగడంతో శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి. క్యూలైన్ల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు సైతం శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పూజల అనంతరం ఉపవాసం వదిలారు. రాత్రి లింగోద్భవం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

– కుత్బుల్లాపూర్



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్



సుభాష్‌నరగ్‌లోని కాశీ విశ్వేశ్వర ఆలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు



నిజాంపేటలో అభిషేకంలో పాల్గొన్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు



శ్రీరామ్‌నగర్‌లోని శివమార్కండేయస్వామి ఆలయంలో..



జగద్గిరిగుట్ట కొండపై మల్లికార్జునస్వామి, భ్రమరాంబికి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు



శివ లింగానికి అభిషేకం చేస్తున్న జీడిమెట్ల కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి



శివ లింగానికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ కుటుంబ సభ్యులు



శివలింగానికి పూజ చేస్తున్న నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి



సుభాష్‌నగర్‌లో జరిగిన పూజలో పాల్గొన్న చెరుకుపల్లి భరతసింహారెడ్డి



అంగడిపేట్‌లో శివుడి దర్శనానికి భక్తుల క్యూ..





చింతల్ శివాలయంలో భక్తులకు పండ్లు అందజేస్తున్న శ్రీ కామాక్షి సిమెంట్ ఏజెన్సీ, భారతి సిమెంట్స్ బృందం

నాణ్యత లేని డివైడర్లు

రంగారెడ్డినగర్: ప్రమాదాలు చోటు చేసుకోకుండా ప్రధాన రహదారుల వెండి ఏర్పాటు చేస్తున్న డివైడర్ల నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతోంది. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని ప్రధాన రోడ్లపై లక్షలాది నిధులు వెచ్చించి కిలోమీటర్ల మేర డివైడర్లను ఏర్పాటు చేశారు. అయితే డివైడర్ల ఏర్పాటులో సంబంధిత కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్దేశించిన మందం మేర కాంక్రీట్ వేయకుండా పనులను మమ అనిపిస్తున్నారు.

◆ గాజులరామారం నుంచి షాపూర్‌నగర్ చౌరస్తా వరకు ఏర్పాటు చేసిన డివైడర్ పనుల్లో ఇది తేటతెల్లమవుతోంది. షాపూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో రోడ్డుపై ఉన్న డివైడర్ ఇటీవల ధ్వంసమైంది. ఏదైనా వాహనం ఢీకొట్టడంతో కాంక్రీట్ ఊడి ఇనుప ఊచలు బయటకు వస్తాయి. ప్రమాదశాత్తు వాహనాలు ఢీకొట్టినా తట్టుకునేలా గతంలో డివైడర్లు ఉండేవి. కాని పనుల్లో అధికారుల పర్యవేక్షణ లేమి కారణంగా కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో డివైడర్లు నాసిరకంగా వేస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు ధ్వంసమైన డివైడర్‌కు మరమ్మతులు చేయించి భవిష్యత్‌లో నాణ్యత లోపం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



షాపూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ధ్వంసమైన డివైడర్

శిక్షణ పూర్తి.. సర్టిఫికెట్లు అందజేత

చింతల్: లార్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గణేష్‌నగర్‌లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఉచిత టైలరింగ్‌ను పూర్తి చేసిన మహిళలకు హైదరాబాద్ సంస్కృతి లయన్స్ క్లబ్ సభ్యులు సుజాత, నిర్మల, సంస్థ వ్యవస్థాపకురాలు లయన్ లక్ష్మి, లయన్ డాక్టర్ సురేష్ కుమార్ పాల్గొని సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. నేడు ప్రపంచ వ్యాప్తంగా మహిళలు ఎన్నో విజయాలు సాధిస్తున్నారని అన్నారు. పారిశ్రామికవేత్తలుగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొన్నారు.



తెలంగాణ టీ–చాంపియన్‌షిప్– 2024

మాదాపూర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హెచ్ఐసీసీలో తెలంగాణ టీ చాంపియన్‌షిప్– 2024ను నిర్వహించారు. మహిళలు టీని తయారీలో తమ ప్రతిభను చాటారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీ లో గురువారం రాత్రి హైబీజ్ టీవి పోటీల్లో మహిళలు పెట్టిన ఛాయ్‌ని జ్యూరీ సభ్యులు రుచి చూశారు. అత్యధిక పాయింట్లు సాధించిన 12 మందిని విజేతలుగా నిర్ణయించారు. మొదటి బహుమతి కె.జ్యోత్స్న లక్షరూపాయలు, రెండవ బహుమతి వరలక్ష్మి రూ.50వేల రూపాయలు, మూడవ బహు మతి పి.జ్యోత్స్నకి రూ. 25వేలు, ఇద్దరికి రూ.10వేల చొప్పున ఐదుగురు విజేతలకు నగదును, బహుమతులను అందజేశారు.

కబ్జాదారుల బరితెగింపు

చింతల్: కబ్జాదారులు బరితెగిస్తున్నారు.. అభివృద్ధి పనులకు కేటాయించిన స్థలాలను సైతం వదలడం లేదు. జీడిమెట్ల డివిజన్ గాయత్రినగర్‌లో వ్యర్థ జలాలను శుద్ధి చేయడానికి ఏర్పాటు చేయనున్న ఎస్టీపీ ప్లాంట్‌కు జలమండలి స్థలం కేటాయించింది. ఈ నేపథ్యంలో ఓ వ్యక్తి సదరు స్థలంలో పక్కా గదిని నిర్మించి విద్యుత్ మీటర్‌ను సైతం బిగించాడు. శుక్రవారం సదరు స్థలాన్ని సందర్శించిన జలమండలి డీజీఎం రాజేష్ పక్కా నిర్మాణాన్ని చూసి అవాక్కయ్యారు. గదిని పరిశీలించగా విద్యుత్ మీటర్ ఉండటంతో వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో మీటర్‌ను తొలగించారు. అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసి సదరు వ్యక్తిపై కేసు నమోదు చేయిస్తామని జలమండలి అధికారులు పేర్కొన్నారు.



ఎస్టీపీ ప్లాంట్‌కు చెందిన స్థలంలోని అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీజీఎం రాజేష్

డ్యూటీకి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



సతీష్..ఫైల్..

దుండిగల్: డ్యూటీకి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిమైసమ్మ ప్రాంతానికి చెందిన సతీష్ (36), సత్యగౌరి భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సతీష్ బాచుపల్లిలోని రెడ్డీస్ ల్యాబ్‌లో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా ఈనెల 6వ తేదీన ఎప్పటిలాగే విధులకు వెళ్లాడు. అదేరోజు సత్యగౌరి తన భర్తకు ఫోన్ చేయగా స్పందించలేదు. వెంటనే అతడి సహద్యోగికి ఫోన్ చేయగా సతీష్ డ్యూటీకి రాలేదని చెప్పాడు. అతని కోసం గాలించినా ఆచూకీ లభించకపోవడంతో సత్యగౌరి శుక్రవారం దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'రాష్ట్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది'

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని.. ఇందులో భాగంగానే కండ్లకోయ సమీపంలో ఐటీపార్క్‌కు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి భూమిపూజ చేయనున్నారని మేడ్చల్–మల్కాజ్‌గిరి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో శంకుస్థాపన తరువాత జరిగే బహిరంగ సభ ఏర్పాట్లపై సమావేశమయ్యారు.

◆ ఈ సందర్భంగా హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 90 రోజుల వ్యవధిలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలలో నాలుగింటిని అమలు పరిచారన్నారు. త్వరలోనే గృహలక్ష్మి, అర్హులకు ఇళ్లను అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఐటీ పార్క్ ఏర్పాటుతో కుత్బుల్లాపూర్, మేడ్చల్ నియోజకవర్గాల్లో అభివృద్ధిలో మరింత వేగం పుంజుకోనుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ విజయవంతం అయ్యేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, హన్మంతరెడ్డి తదితరులు

◆ ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, మేడ్చల్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, మేడ్చల్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.